# ప్రవాహం

డా॥ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి



ఈజీ ఛెయిర్‌లో వెనక్కివాలి వున్న వేదవతి టైమ్ చూసి ఆశ్చర్యపోయింది... తను ఈ ఛెయిర్లో కూర్చున్నప్పుడు పదకొండు... అంటే... అంటే.. రెండు గంటలపైగా ఒకే సమస్యని గురించి ఆలోచిస్తూనే వుందన్నమాట... అందుకేనేమో తల బరువుగా వుంది.

ఒకప్పుడు ఈ యింట్లో ఊపిరి పీల్చుకోవడానికి కూడా తనకి సమయం దొరికేది కాదు... ఇప్పుడు ఎటూకాకుండా అయిపోయింది. పని చేయాలంటే ఒంట్లో సత్తువలేదు. ఖాళీగా వుంటే ఈ బుర్రకు తీరికుండదు.

ఇలా ఆలోచిస్తూనే వేదవతి మళ్ళీ అసంకల్పితంగా అదే సమస్యలోకి జారుకుంది.. తన పేగు చించుకుని, తనరక్తం పంచుకుని పుట్టిన తన పెద్ద కొడుకులో ఈ ఛాందస భావాలేమిటి?.. వయసు మీదపడే కొద్దీ, చేదు అనుభవాలు లాటీ దెబ్బల్లా తగుల్తున్నా కూడా వీడు మారడేం?....

ఈ రోజు రెండు గంటల క్రితం మరలా జరిగిన ఘటనలు ఆమెను కలవరపెట్టి, వద్దనుకున్నా, విదిల్చుకున్నా అవి తనని వదలనంటున్నాయి.

వేదవతి పెద్ద కొడుక్కి ముగ్గురాడపిల్లలు.... మొదటి మనవరాలు శ్రీవల్లి... ఆ పిల్లకు పెళ్ళయి పాతిక సంవత్సరాలు. శ్రీవల్లి పెద్దకూతురు రేవతికి ఈ రోజు పెళ్ళిచూపులు... అబ్బాయిది హైదరాబాద్ కావడంతో వాళ్ళ కోరిక మేరకు శ్రీవల్లి విజయవాడ నుండి కూతుర్ని తీసుకుని పుట్టింటికొచ్చి పెళ్ళి చూపులు ఏర్పాటు చేసింది. అయితే ఇప్పుడు చూసుకోటానికొస్తున్న పెళ్ళికొడుకు వాళ్ళు నియోగులు కాదు.

వాళ్ళు నియోగులు కాదు కనక ఈ సంబంధం కుదరలేదు. వేదవతికి రెండో కూతురు భువన జీవితం గుర్తొస్తూనే వుంటుంది. భువనకు ఇరవై సంవత్సరాలు రాక ముందే పెళ్ళిళ్ళ వేట మొదలయింది. అప్పటికి అమ్మాయి డిగ్రీ చదువుతోంది.

'భువనా ఈ రోజు కాలేజీకెళ్ళకు.... నిన్ను చూసుకోవడానికి పెళ్ళి వారొస్తున్నారు'.. అని తల్లి పని హడావిడిలో నుండే తనకి చెప్పిన మాటలు భువనకి రుచించలేదు.

తనకి అప్పుడే పెళ్ళా?

కానీ భువన తన మనసులో అభ్యంతరాన్ని మనసులోనే సమాధి చేసుకుంది....

ఇష్టం లేకుండానే ఆ అపరిచిత యువకుడి ముందు తలవంచుకుని కూర్చుంది.

ఆ అబ్బాయికి భువన చాలా నచ్చింది.. కానీ అమ్మాయి తండ్రి బాలసుబ్రహ్మణ్యంకు మాత్రం ఈ సంబంధం సమ్మతం కాలేదు.. ఎందుకంటే వాళ్ళు నియోగులు కారు. ఆ సంగతి మధ్యవర్తి దాచాడు. అలా దాచి మోసం చేయడం కూడ అతడి అభిమతం కాదు.. అతడు వ్యాపారవేత్త... వద్దనుకున్న మనిషితో వస్తువు కొనిపించగల నేర్పరి.

ఆరోజు వేదవతికి కూడ ఆ మధ్యవర్తి ధోరణి నచ్చలేదు. వెయ్యి అబద్ధాలాడి పెళ్ళి చేయడానికి తమ కుటుంబమేమయినా చిన్నదా?.. లేక డబ్బు ఖర్చుచేయలేనిదా?..

భువనకి మాత్రం పెళ్ళి ఆగిపోవడం చాలా నచ్చింది. గుండెలనిండా గాలి పీల్చుకుని రెక్కలు విప్పుకుని కాలేజీకి వెళ్ళిపోయింది.

మరలా మరో సంబంధం.... విజయవాడ నుండి శ్రీవల్లి కూడ వచ్చింది... మూడో కూతురు ఆరేళ్ళ ఝాన్సీ పట్టుపావడా, బంగారెక్కల జాకెట్టు వేసుకుని అక్క పక్కనే కూర్చుంది.

అబ్బాయి అందంగా వున్నాడు. భువనకి నచ్చాడు కానీ తండ్రికా సంబంధం నచ్చలేదు... కారణం అబ్బాయి అమ్మాయి కంటే కేవలం ఆరు నెలలు మాత్రమే పెద్ద... కనీసం నాలుగేళ్ళయినా తేడా లేకపోతే ఏం బావుంటుంది?

ఆ సంబంధం తప్పిపోయినపుడు మాత్రం 'అయ్యో' అనుకుంది భువన... ఆ తర్వాత మర్చి పోయింది.

ఈసారి వచ్చిన సంబంధానికి ముందుగానే మాటలు జరిగాయి. కోరుకున్నట్లుగానే వాళ్ళు ఆరు వేల నియోగులు...

అబ్బాయి సుమారుగా ఉన్నాడు. ఐ.టి.ఐ.లో పని. మంచి జీతం. అంతా బాగానే వుంది కానీ అబ్బాయి మరికాసేపు నోరు మూసుకుని కూర్చున్నట్టయితే పెళ్ళి నిశ్చయం అయిపోయి వుండేది. అతడు కాస్త మాటకారిలా వున్నాడు... మొన్న తన స్నేహితుడు చౌదరి పెళ్ళిలో కోడి గుడ్డు తిన్న వైనాన్ని చాలా ఆసక్తిగా చెప్పుకొచ్చాడు... బాల సుబ్రహ్మణ్యానికి మండుకొచ్చింది. దాంతో పెళ్ళి మళ్ళీ తప్పిపోయింది.

ఈసారి భువనకి దిగులన్పించింది... అప్పటికి ఆమె డిగ్రీ పూర్తయి పోయింది. ఆరు నెలలు గడిచాక మరో మంచి సంబంధం వచ్చింది. ఈసారి సంబంధం తప్పిపోవడానికి కారణం... అబ్బాయి అమెరికాలో సెటిలవబోతున్నాడు... అమ్మాయిని పరాయి దేశాలకి అంపకాలు పెట్టడానికి భువన తండ్రి సిద్ధంగా లేడు. అయినా భువన నోరు తెరిచి ఏమీ మాట్లాడలేదు.

ఎవరికోసమూ ఆగనికాలం పరిగెడుతూనే వుంది... తండ్రి మాటకు కట్టుబడిన భువన నిశ్శబ్దాన్ని తనలో లీనం చేసుకుంటూ కాలం భువన నెత్తిమీదకు ముప్పయ్యయిదు వసంతాల్ని తెచ్చి వదిలింది.... ఆ తర్వాత ఇక భువనకు సంబంధాలు రావడం మానేశాయి... అప్పటికిక ఝాన్సీకి సంబంధాలు చూడడం మొదలు పెట్టారు... భువనలో ఏదో తెలీని మార్పు మొదలయ్యింది.

\- \- \-

"నేనొప్పుకోను.... ఒప్పుకోను... ఒప్పుకోనంటే ఒప్పుకోను" అరుస్తోంది. భువన గట్టిగా.... లోపల గదిలో నుండి భువన రోదనలు కేకలు... శబ్దాలూ..

అమ్మా అచ్యుతా! ఏమయింది? లేచి నిల్చుని కంగారుగా అరిచింది వేదవతి... "ఏంలేదు లెండ త్తయ్యా మీరు పడుకోండి" లోపలినుండే గట్టిగా చెప్పింది కోడలు అచ్యుత వల్లి...

ముసలి ప్రాణం ఓపిక పట్టలేక పోయింది. "బాబూ ఏమైందిరా" లేని శక్తి తెచ్చుకుని మనవరాలి గదిలోకి తొంగి చూసింది వేదవతి. గదంతా గందరగోళంగా వుంది. కొన్ని వస్తువులు పగిలి పోయి వున్నాయి...

**PSLV - C6**

మే 5, 2005 గురువారం నాడు సతీష్ దావన్ స్పేస్ సెంటర్, శ్రీహరికోటనుంచి Polar Sattilite Launching Vehicle - C6 ని విశ్వ విఖ్యాత శాస్త్రవేత్త, భారత ప్రథమ పౌరుడు రాష్ట్రపతి అబ్దుల్ కలాం పర్యవేక్షణలో విజయవంతంగా ప్రయోగించారు.

ఆకాశంలోకి దూసుకుపోతున్న ఆ రాకెట్ పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందడం విశేషం.

మరికొన్ని అడ్డ దిడ్డంగా పడివున్నాయి.... భువన మంచంమీద కూర్చుని పరిచి వున్న బెడ్‌షీట్‌ని చింపడానికి ప్రయత్నిస్తోంది. ఆమె కళ్ళల్లో నిర్లక్ష్యం... లెక్కలేని తనం

ఎంతో సాత్త్వికమయిన పిల్ల.... ఎందుకిలా మారిపోయింది? వేదవతి గుండెలు అవిశిపోతున్నాయి.... భువనని చూస్తుంటే...

## తీరని కోరిక

నాన్న !
నీ కోరిక తీర్చడానికి
ఆట, పాటలు మర్చిపోయి
అహరహం కష్టపడి డాక్టర్నయ్యాను !
నాన్న !
మరి నా కోరిక తీర్చవూ !
నేను కోల్పోయిన
బాల్యాన్ని నాకు తిరిగివ్వవూ !

— యస్. మహబూబాషా

తాము... భువనకు ప్రాణాన్ని మాత్రం మిగిల్చి బతుకును కొల్లగొట్టిన తమకు అసలు మాట్లాడే హక్కు వుందా?

గడప వద్దే ఆమె, ఆమె ఆలోచనలు కూడా ఆగిపోయాయి...

కూతుర్ని ఒళ్ళో పెట్టుకుని కుమిలి కుమిలి ఏడుస్తోంది శ్రీవల్లి... వేదవతికి గుండెలు పిండినట్టయింది ఏమయిందిరా?

"నీ మనవరాలు మొండికేస్తోంది... శ్రీవల్లి కూతురు రేవతికి పెళ్ళి చేయడానికి వీల్లేదంట" చెప్పాడు కొడుకు.

"వీల్లేదా? ఎందుకట? విస్తుపోయింది వేదవతి.

మాయరోగం... వాళ్ళు ఆరువేల నియోగులు కారంట. దీనికెందుకు దురద?... కొడుకులో చెప్పలేనంత ఆవేశం... చిత్రంగా వేదవతి గుండెల్లో ఆనందపు తడి.

నా కొడుకు మారాడా? ఒక జీవితం వ్యర్థమయిపోయాక ఇప్పుడు నా కొడుకులో మార్పొచ్చిందా?... పోన్లే ఝాన్సీకయినా త్వరగా పెళ్ళవుతుంది. భారంగా నిట్టూర్చిందామె..

"చూడమ్మా.... ఎంత వేపుకుతింటోందో ఇది శ్రీవల్లికూతురి పెళ్ళి సంగతి మనకెందుకమ్మా... అమ్మాయి మన ఇంటి పేరదయితే సరే... ఎవరో ఇంటి పిల్లకి దీని అభ్యంతరమేమిటి చెప్పు?

అంతేనా?... కొడుకు మారలేదా? నిరాశ చెందిందామె.

తండ్రికి, భర్తకు, కొడుక్కు లొంగి బతుకుతూ వయసును పెంచుకున్న వేదవతి నిశ్శబ్దంగా పక్కగదిలోకి నడిచింది. ఆమెకు తెలుసు. భువనను ఎవరూ ఓదార్చ లేరు. ఆ పిల్లను కోప్పడడానికీ, ఓదార్చడానికీ తమవద్ద భాషవున్నా మార్గం లేదు... ఏమి చెప్పి ఓదార్చాలి? ఏ ఆశ చూపి మార్చాలి? అసలు ఆమెకు దక్కని జీవితాన్ని తిరిగి తెచ్చివ్వగలరా?

"ఇంకేంకావాలి? నీరెండో మనవరాలి పుణ్యమా అని ఈ మంచి సంబంధం తప్పిపోయింది కదా... ఏడుపుకాక మరేముంది? ఇంకేముంది నానమ్మా నా జీవితానికి?"

ఒక్క నిముషం మాట్లాడలేదు వేదవతి.. క్షణం తరువాత... "పోనీలేమ్మా... పసిపిల్ల... ఈసంబంధం కాకపోతే మరోటి వస్తుందిలే. దిగులు పడకు... "ఓదార్చబోయింది వేదవతి.

"బాగానే చెప్తున్నావు నానమ్మా... జాతకాలతో సహా అన్నీ కుదిరిపోయి, యిక ఫిక్సయిపోయిందనుకున్న సమయంలో వాళ్ళుండగానే భువన వచ్చి గందరగోళం చేసింది... దానికి పిచ్చి పట్టి నట్లుంది.

శ్రీవల్లి మాటలకు వేదవతి మనసులో నిగ్రహించుకోవాలన్నా నిగ్రహించుకోలేనంత విముఖత్వం ఏర్పడింది...

'ఎంత స్వార్థపరులీ మనుషులు!... తన చెల్లెలికి కొన్నివందల సంబంధాలు తప్పిపోయినపుడు అసలే పెళ్ళికాకుండా ఉండిపోయినందున.. లేని ఆవేదన.. ఇప్పుడు తన కూతురి విషయంలో ఒక్క సంబంధం చేజారిపోయినందుకు.... ఎందుకున్నట్టు !

"నాన్నమ్మా! భువనని ఏదయినా పిచ్చాసుపత్రి లో చేర్పించినట్టయితే బావుంటుందేమో" చెప్పింది శ్రీవల్లి.

'దానికి పిచ్చి పట్టించిందే మనం... చదువు

కుంటున్న పిల్లను చదువాపించేసి యిటు పెళ్ళి చేయక, అటు జీవితానికోమార్గమూ చూపించక పిచ్చి పట్టించింది మనమే' అని గట్టిగా అరవాలను కుంది మూడుతరాలు చూసిన ఆ ముదుసలి.... కానీ ఆమె అలా అరవలేదు మెత్తటి చురకత్తిలాంటి జవాబొకటి చెప్పింది.

"మన ఇల్లే ఒక ఛాందసాల పిచ్చాసుపత్రయి నపుడు మనకి వేరే ఆస్పత్రులెందుకమ్మా"

"అవును, నాన్న తప్పు చేశారు... అప్పుడు శాఖలూ గోత్రాలూ అంటూ పెళ్ళి చేయకుండా ఇప్పుడు ఇంటికో గుదిబండను తయారు చేశారు" కళ్ళు తుడుచుకుంటూ అంది శ్రీవల్లి.

నిజమేఁ శ్రీవల్లి చెప్పింది నిజమే...

కచ్చి, కోపమూ, నిష్ఠురమూ, పుల్ల విరుపు మాటలూ వ్యతిరేఖ భావాలు నైరాశ్యతా... ఎవరూ సుఖపడకూడదనే తత్వం, మొండితనం, కుసంస్కారం, సభ్యతా, హీనతా అన్నీ భువన ఇప్పుడు సంతరించుకుంది... ఎందుకు సంతరించుకుంది? ఆలోచిస్తే అందరికీ తెలుసు... ఆ అపరాధ భావాన్ని ఎవరి గుండెల్లో వాళ్ళు భద్రంగా దాచుకున్నారు.

"వల్లీ! నేనొకటి చెప్తే నువ్వు బాధ పడవు గదా?"

ఏమిటన్నట్లుగా నానమ్మకేసి చూసింది శ్రీవల్లి.

"ఇప్పుడు నువ్వు మీ నాన్నను నిందిస్తున్నావే... ఛాందసమని... అది మాత్రం నీలో పెంచుకోకు... అప్పుడే నీ పిల్లలకు నువ్వు మంచి జీవితాన్నివ్వ గలుగుతావు"

"నాలో అలాటి మూఢ భావాలు లేవు"

"లేవా?.... లేకపోతే మంచిదే... ఇందాక అదేదో జాతకాలు కలిశాయన్నావే... అదీ !!

"ఏదో జాతకాలు... అందరూ చూస్తున్నారు.. మనమూ చూస్తున్నాము అంతేకాని అవన్నీ పట్టించుకుంటే పెళ్ళిళ్ళవుతాయా?"

"మంచి మాటే చెప్పావురా.... కానీ తల్లీ! జాతకాలు ఎందుకు కలవాలో కాస్త చెప్పగలవా?"

"నీకు జాతకాల మీద నమ్మకం లేదా?" ఎదురు ప్రశ్న వేసింది శ్రీవల్లి.

"ఉండేది. ఒకప్పుడు. కానీ అనుభవాలు పండి... ఎదురుదెబ్బలు తగిలీ... ఇప్పుడు నమ్మకం పోయిందిరా"

శ్రీవల్లి ఏమీ మాట్లాడలేదు... ఆమె నానమ్మ అనుభవాల తాలూకా వయసుకు గౌరవమిచ్చిందో లేక తనకీ అంతరాంతరాల్లో ఏమూలో అపనమ్మకం వుందో... మౌనంగా చూస్తుండిపోయింది.

"నేను చాలా పెళ్ళిళ్ళు చూశాను... ఆ పెళ్ళిళ్ళ తరువాత వారి జీవితాలని చూశాను.. అన్నింటినీ బేరీజు వేసుకుంటే పెళ్ళికి మంచిరోజు, మంచి ముహూర్తం జాతకాల ఫలం ఇవేమీ అవసరం లేదన్పిస్తోందిరా..."

అవ్వకు జవాబు చెప్పలేదు శ్రీవల్లి. కూతుర్ని ఒళ్ళో నుండి లేపి కాళ్ళు సరిచేసుకుంది.

"కాళ్ళు నొప్పిగా వున్నాయా? కాస్త ఒత్తనా అమ్మా"

"వొద్దొద్దు..." నాన్నమ్మ చేతిని నెట్టేసి కంగారుగా అంది శ్రీవల్లి.

అవ్వ అభిమానానికి మనవరాలు, మనవరాలి మర్యాదకు అవ్వా.. అప్పటికప్పుడే అందిన చిన్న ఆనందంలో వుండగా ఝాన్సీ ఆ గదిలోకి వచ్చింది.. నిశ్శబ్దంగా ఓ మూల కూర్చుంది.. ఆమెకి ఇల్లు ఇలా అశాంతి నిలయంలా వుండడం ఇష్టపడడం లేదు..

ఝాన్సీకి ఒక్కదానికే తెలుసు, వేదవతి నిశ్శబ్దంలోని వివేకం, సర్దుబాటు తత్త్వంలోని లౌక్యం. అంతే కాదు ఏమీ చదువుకోని నాన్నమ్మలో ఎంతటి విశాల భావాలున్నాయో కూడ ఆమెకి తెలుసు.

వార్థక్యం మీదపడిన వేదవతికి తన అనుభవాల సారాన్ని మనుమరాళ్ళ ముందుంచి తన ముందు తరాల వారిని

**పాఠకులకు విజ్ఞప్తి**

'చినుకు' సాహిత్య మాసపత్రిక కోసం చందాలు MO/DD ల ద్వారా పంపించినట్లయితే పత్రికను మీకు పంపిస్తాము.

MO/DD 'చినుకు' సాహిత్య మాసపత్రిక, విజయవాడ పేరు మీద తీసుకోవాలి.

అడ్రస్ : 27,28 3వ అంతస్థు, దత్తాస్ నయాబజార్, రాజ్ యువరాజ్ థియేటర్ ఎదురుగా, గాంధీనగర్.

ప్రభావితం జేయాలనుంది అందుకే ఝాన్సీ గదిలోకి వచ్చినా ఆ సంభాషణను తుంచేయలేదామె.

"ఏంటి నానమ్మా మాట్లాడవు?"

"మీరు చదువుకున్నవాళ్ళు. మీకు చెప్పగల్గినంత తెలివి తేటలు నాకు లేవుగానీ... ఒక్కటి మాత్రం నాకు సరిగ్గానే అర్ధమవుతోంది. పెళ్ళి అనేదానికి కావాల్సింది రెండు మనసులు, వాళ్ళ అభిప్రాయాలు కలవడం అంతేగానీ అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు కాదు... అవన్నీ చూసుకుంటే భర్త దొరుకుతాడు గానీ మనకి కావాల్సిన అభిరుచులూ, భావాలు వున్న వ్యక్తి జీవిత భాగస్వామిగా దొరకడని చెప్తున్నానంతే...

శ్రీవల్లి మాట్లాడలేదు... ఆమె ఈ కొత్త విషయాన్ని అర్థంచేసుకోవడానికి ప్రయత్నిస్తోంది.

"సరేలే... లేచి వెళ్ళి ముఖం కడుక్కురండి" చెప్పింది వేదవతి.

శ్రీవల్లి, ఆమె కూతురు ఇద్దరూ లేచారు... వాళ్ళు గుమ్మం దాటిందాక చూసి నోరు విప్పింది ఝాన్సీ.

"నానమ్మా!... ఈ ఇంటిని, ఇంట్లోని మనుషుల్ని మార్చడమెలా?"

"మార్చాలా? అయితే ఓ పని చేస్తావా?" అల్లరిగా నవ్వుతూ అంది వేదవతి తనూ నవ్వి తలూపింది ఝాన్సీ.

"ఓ మంచి కుర్రాణ్ణి, నీకు బాగా నచ్చినవాడ్ని ఎంచుకుని పెళ్ళి చేసుకుని మీ నాన్నను రక్షించరా" అలా చెప్పి బరువు తీర్చుకుంది వేదవతి... రెండు నిమిషాల తర్వాత అడిగింది ఝాన్సీ సాలోచనగా.

"నాకు రెండు ప్రశ్నలకు జవాబు కావాలి నానమ్మా"

"అడగరా"

"నీ నవ్వుకు అర్థం...?"

"ఏముందీ? ఇవన్నీ జరిగేవా పెట్టేవా? తెలుగింటి ఆడపడుచుకు మనసు పారేసుకోవడమే తెలుసు గానీ జీవితాన్ని మలుచుకోవడం తెలీదు.... అందుకే నవ్వొచ్చింది. వాడిని పరీక్షించబోయి ఆ పిల్లే ఆకర్షణలో పడిపోతోంది అదే దౌర్భాగ్యం..."

"లేదులే నాన్నమ్మా... ఇప్పుడు కాస్త మారుతున్నారు అమ్మాయిలు... ఆకర్షణ, ప్రేమ మధ్యగల తేడా తెల్సుకుంటున్నారు"

"సర్లే నీ రెండో ప్రశ్నేమిటి?

ఈసారి ఝాన్సీ పెద్దగా నవ్వింది.

"నువ్వు నాకీ సలహా ఎందుకిచ్చావు? మీ అబ్బాయిని రక్షించడానికా? లేక నా జీవితం కోసమా?

"రెండూరా ముఖ్యంగా మా అబ్బాయిని రక్షించడానికేనే... వాడికసలే బి.పి"

తడుముకోకుండా సమాధానమిచ్చింది వేదవతి

\- - -

ఆ రాత్రి నాన్నమ్మ పక్కలో పడుకున్న ఝాన్సీ, వేదవతి నుదుటి మీద ముద్దు పెట్టుకుని అడిగింది.

"నానమ్మా! నువ్వు మా నాన్నను టెన్షన్ నుండి రక్షించడానికేనా... నన్ను ప్రేమించి పెళ్ళి చేసుకోమని చెప్పింది..."

ఏమిటీ! నాకు నా కొడుకు మీదే ప్రేమ ఎక్కువని నువ్వు అసూయ పడ్తున్నావా?" నిశితంగా మనుమరాలి కళ్ళల్లోకి చూస్తూ అంది వేదవతి.

"నీకు ఎవరిమీద ఎంత ప్రేమ, వుంటుందో... దాన్ని అర్థం చేసుకోలేనంత పసిదాన్ని కాదు కానీ.. నాకు నీ మనసులోమాట కావాలి నానమ్మా!"

సీరియస్‌గా అడుగుతున్న మనమరాలి వంక నిస్సహాయంగా చూసి నిట్టూర్చింది వేదవతి.

"ఝాన్సీ! నువ్వు ఊహించినట్టు నా మనసులో ఈ సమాజం చూపిస్తున్న పక్షపాతం పట్ల నిరసన వుంది. కేవలం మూఢనమ్మకాల మూర్ఖత్వంలో... మీ అక్కలాంటి ఆడపిల్లల్ని పెళ్ళికాకుండా మిగిల్చి రక్షణ ఇవ్వని ఈ సమాజంలోకి విసిరేయడం నాకు నచ్చడం లేదురా... అందుకే నిన్ను నీ జీవితాన్ని వెతుక్కోమన్నాను... నేనుకూడా సృష్టికి భిన్నంగా పుట్టలేదు కదమ్మా... అందుకే నా కొడుకు మీద ప్రేమకు లొంగిపోయి... నీకా జవాబిచ్చానురా"

ఝాన్సీకి మాట్లాడను భాష దొరకలేదు.

"ఝాన్సీ! నాకు పై నుండి పిలుపురావడానికి అట్టే... టైమ్ లేదు. నువ్వు నాకో మాట ఇవ్వాలిరా.. ఈ ఛాందసాలను రూపుమాపుతూ వస్తున్న కొన్ని

(తరువాయి భాగం 30వ పేజీలో)

# ఒక కవిత్వం - ఒక కరచాలనం

- చిత్తలూరి సత్యనారాయణ

నైరాశ్యపు కర్దూపం బట్టిన బత్కు పుస్తకంల
ఆశల అక్షరాలు అలుక్కుపోయి
కనిపిస్తున్నాయి.
భావగీతాలు వసివాడి,
దుఃఖ గీతాల్ని స్రవిస్తున్నాయి.
అతుకుల బొంత జీవితం
కన్నీటి దారలతో మాసికలవుతుంది.
జీవితానికి అర్థాన్ని వెతుక్కునే ప్రశ్నలు
సమాధానాల చమురింకి
గాలిలో దీపాలై రెపరెపలాడుతున్నాయి.
తీరికలేని సమయాల కొండచిలువలు
కలసివుండే సందర్భాల కుందేళ్లను
మింగేస్తున్నాయి.
పనివొత్తిడి పులి రాక్షసి
మనసు విప్పుకునే సంధర్భాల్ని
నమిలిపారేస్తుంది.
గాలినిండా అదృశ్య కుడ్యాలు
పాదాలకిందే ఎడారి విస్తరణలు
కంటిపాపల మీద తడియింకిన నిశ్శబ్దాలు
గుండెగోడల మీద ఇనుపగీతాలు గీసుకున్నంక
మనిషికి మనిషి దూరంగా
కక్ష్య తప్పుతున్నాడు.
ఆప్యాయంగా నాలుగు మాటలయ్యే క్షణాల్లేవు
ఆత్మీయంగా రెండు పలకరింపులయ్యే
దృశ్యాల్లేవు
మనుషులంతా ఎవరి చట్రంలో వాళ్లు
తప్పిపోయి
ఒంటరిగా తిరుగుతుంద్రు
అవసరాల చుట్టూ మాత్రమే మనుషులూ
హృదయం మాత్రమే కొల్లగొట్టబడిన
తోలుతిత్తుల్లా ఊపిరాడక ఊరేగుతుండు
ఎడతెరపి లేకుండా కురిసే
ఈ యంత్రాల వాన
మంచుతుఫానుగా మారకముందే
మనసు గడ్డకట్టి, మనిషితనం
మాయమవ్వకముందే
జీవితానికి అర్థాన్ని వెతుక్కునే ప్రశ్నలకు
మనమే సమాధానాలవ్వాలి
పుట్టి మునక్కముందే ప్రవాహాన్ని
అంచనా వేసుకోవాలి
నిద్రకళ్లమీదే మెలుకువ సంతకం చేసుకోవాలి
మనది కాని జీవితాన్నే మనంగా
మోస్తున్న యంత్రాలం
అప్పుడప్పుడయినా, మనలోకి మనం
తొంగి చూసుకుందాం
ఒక కవిత్వంగానో, ఒక కరచాలనంగానో
రోజులో కొన్ని క్షణాలయినా
మనల్ని మనం మనుషులుగా
గుర్తుచేసుకుందాం ! ★

(29వ పేజీ తరువాయి)

## గ్రహణం

తరాల ఆదర్శవాదులకు... నువ్వు వారసురాలివి కావాలి. ఇంకా మిగిలిన ఛాందసపు తల్లిదండ్రుల కారణంగా ఒంటరిగా మిగిలిపోయి సృష్టి ధర్మం ప్రకారం ఆకర్షణకు లొంగి పతనంలోకి దొర్లిపోయే ఆడ పిల్లలు ఇక ఈ సమాజంలో మిగలకూడదు..."

"అలాగే నానమ్మా! తప్పకుండా నా ప్రయత్నం నేను చేస్తాను నానమ్మా!..." ఓ వింత భావావేశంతో వేదవతి మీద వాలిపోయి ఏడ్చేసింది ఝాన్సీ. ★